సీఎం వైఎస్ జగన్ పాలనపై ప్రజలు సంతృప్తి

- రాష్ట్ర వ్యవసాయశాఖ మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి



ముత్తుకూరులో సంక్షేమ పథకాల గురించి ప్రజలకు వివరిస్తున్న మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి

ముత్తుకూరు: సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పాలనపై ప్రజలు నూరు శాతం సంతృప్తి వ్యక్తం చేస్తున్నారని రాష్ట్ర వ్యవసాయశాఖ మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి అన్నారు. ముత్తుకూరు పంచాయతీలోని అగచాట్లపురం, రాజీవ్‌కాలనీ, కట్టకింద గిరిజనకాలనీ, తాళమ్మవీధి, బలిజపాళెంలలో గురువారం మూడో రోజు నిర్వహించిన 'గడప గడపకు మన ప్రభుత్వం' కార్యక్రమంలో మంత్రి పాల్గొని మాట్లాడారు. రానున్న రోజుల్లో అభివృద్ధి–సంక్షేమ కార్యక్రమాలను మరింత సమగ్రంగా ప్రజలకు అందజేస్తామని తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం అర్హత కలిగిన ప్రతి ఒక్కరికీ పింఛన్లు పంపిణీ చేస్తోందని, దీనిపై లేనిపోని అభద్రతా భావాలను కలిగించే టీడీపీని నమ్మవద్దని పేర్కొన్నారు. టీడీపీ పాలనలో జన్మభూమి కమిటీలను ఏర్పాటు చేసి, అనర్హులను అందలం ఎక్కించారని గుర్తుచేశారు. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో ఎవరి సిఫార్సు, సంతకం లేకుండా సంక్షేమ ఫలాలు నేరుగా అర్హులైన పేదలకు అందుతున్నాయని తెలిపారు. పేదలకు ఇళ్ల స్థలాలు ఇవ్వకుండా టీడీపీ హయాంలో ప్రజలను ఇబ్బందులు పాల్జేసిందని, తమ ప్రభుత్వం వాటిని అధిగమించి ఇంటి నివేశన స్థలాలు అందజేయడంతోపాటు పక్కాగృహాలు నిర్మిస్తోందని తెలిపారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ మెట్ట విష్ణువర్ధన్‌రెడ్డి, ఎంపీపీ గండవరం సుగుణ, మండల ఉపాధ్యక్షుడు పోలిరెడ్డి చిన్నపరెడ్డి, సర్పంచ్ బూదూరు లక్ష్మి, ఎంపీటీసీ సభ్యులు యల్లంగారి వెంకటేశ్వర్లు, షేక్‌నవీద్‌బాషు, నాయకులు మునుకూరు రవికుమార్‌రెడ్డి, ఈదూరు రామమోహన్‌రెడ్డి, కె.లక్ష్మణరెడ్డి, షేక్ రహీమ్, ముత్యంగౌడ్ తదితరులు పాల్గొన్నారు.

సంస్కృతి, సంప్రదాయాలను కాపాడుకుందాం

తెలుగు వారి ప్రాచీన సంస్కృతి, సంప్రదాయాలను కాపాడుకోవాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందని రాష్ట్ర వ్యవసాయశాఖ మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి అన్నారు. సంక్రాంతి పండగను పురస్కరించుకుని ముత్తుకూరులోని జెడ్పీ హైస్కూల్‌లో గురువారం 'మన సేవ' ఫౌండేషన్ ఆధ్వర్యంలో జరిగిన ముగ్గుల పోటీల్లో విజేతలకు మంత్రి కాకాణి బహుమతి ప్రదానం చేశారు. మహిళలు వేసిన ముగ్గులను పరిశీలించారు. రంగవల్లుల పోటీలు నిర్వహించిన నిర్వాహకులను అభినందించారు. కార్యక్రమంలో ఈదూరు రామమోహన్‌రెడ్డి, మునుకూరు రవికుమార్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

భక్తిశ్రద్ధలతో ధనుర్మాస పూజలు



ధనుర్మాస పూజల్లో పాల్గొన్న భక్తులు

పొదలకూరు: పట్టణంలోని శ్రీలక్ష్మీ గోదాదేవి సమేత వెంకటేశ్వరస్వామి ఆలయంలో గురువారం ధనుర్మాస పూజలు భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ఈ సందర్భంగా వెంకటేశ్వరస్వామికి, శ్రీలక్ష్మీ గోదాదేవి అమ్మవార్లకు సుగంధ ద్రవాలతో అభిషేకాలు, ప్రత్యేక అలంకరణ, విశేష పూజలు నిర్వహించారు. దంపతులు పూజల్లో పాల్గొని తీర్థప్రసాదాలు స్వీకరించారు. భక్తులు స్వామి, అమ్మవార్లను దర్శించుకుని మొక్కులు తీర్చుకున్నారు. భక్తుల గోవింద నామస్మరణతో ఆలయ ప్రాంగణం మార్మోగింది.

ప్రభుత్వ భూముల పంపిణీపై గ్రామసభలు

పొదలకూరు: భూమి లేని నిరుపేదలకు ప్రభుత్వ భూముల పంపిణీపై మండలంలోని అన్ని సచివాలయాల పరిధిలో శుక్రవారం నుంచి గ్రామసభలు నిర్వహిస్తామని తహసీల్దార్ ఐఎస్ ప్రసాద్ తెలిపారు. గురువారం తహసీల్దార్ విలేకరులతో మాట్లాడుతూ నిరుపేదలకు ప్రభుత్వం అసైన్‌మెంట్ కమిటీ ద్వారా భూములు మంజూరు చేసేందుకు ఈ నెల 18వ తేదీ వరకు గ్రామసభలను నిర్వహించేందుకు షెడ్యూల్ తయారు చేశామన్నారు. గ్రామాల్లో ఖాళీగా ఉన్న ప్రభుత్వ భూమిని గుర్తించి లబ్ధిదారులను ఎంపిక చేసి గ్రామసభలో ప్రకటించడం జరుగుతుందన్నారు. అభ్యంతరాలు ఉంటే గ్రామస్తులు వినతిపత్రాల రూపంలో అందజేయాల్సి ఉంటుందన్నారు. 13వ తేదీ పులికల్లు, వావింటపర్తి, ఊసపల్లి, బిరదవోలు, పార్లపల్లి, మొగళ్లూరు, గురవాయపాళెం, ఆర్‌వై పాళెం, అంకుపల్లి, పొదలకూరు, ఆల్తుర్తి, కనుపర్తి, మర్రిపల్లి, ఇనుకుర్తి, ముదిగేడు, మరుపూరు, చాటగొట్ల గ్రామాల్లో గ్రామసభలను నిర్వహిస్తామని తెలిపారు. 17వ తేదీ డేగపూడి, డేగపూడిరాజుపాళెం, దుగ్గుంట, దుగ్గుంటరాజుపాళెం, ఊట్లపాళెం, సూరాయపాళెం, ప్రభగిరిపట్నం, అమ్మవారిపాళెం, బత్తులపల్లి, భోగసముద్రం, నావూరు, నేదురుమల్లి, వెలికంటిపాళెం, 18న తాటిపర్తి, నల్లపాళెం, బత్తులపల్లిపాడు, విరువూరు, మహ్మదాపురం, అయ్యగారిపాళెం, నందివాయ, తోడేరు గ్రామాల్లో గ్రామసభలను నిర్వహిస్తామని తెలిపారు.

తల్లిదండ్రుల చెంతకు చిన్నారులు



నెల్లూరు(వేదాయపాళెం): వీఆర్సీ సెంటర్‌లో లభించిన ముగ్గురు చిన్నారులను వారి తల్లిదండ్రులకు ఐసీడీఎస్ సిబ్బంది గురువారం అప్పగించారు. వివరాలు.. ముత్తుకూరులోని గిరిజన కాలనీకి చెందిన చెంచమ్మ తన ముగ్గురు పిల్లలతో కలిసి నగరానికి సోమవారం వచ్చారు. తల్లి నుంచి తప్పిపోయిన పిల్లలు వీఆర్సీ సెంటర్‌లో ఉండగా, ఐసీడీఎస్ అధికారులు అక్కున చేర్చుకొని శిశుగృహకు తరలించారు. చిన్నారుల తల్లిదండ్రులు గణేష్, చెంచమ్మ పిల్లల కోసం వెతికి పోలీసులకు ఫిర్యాదు చేశారు. చైల్డ్ వెల్ఫేర్ కమిటీ సభ్యులు వారికి కౌన్సెలింగ్ నిర్వహించి, ఐసీడీఎస్ సంరక్షణలో ఉన్న చిన్నారులను అప్పగించారు. ఐసీడీఎస్ ప్రాజెక్ట్ అధికారి సౌజన్య, జిల్లా బాలల సంరక్షణాధికారి సురేష్, సమత, శిశుగృహ మేనేజర్ లక్ష్మి, తదితరులు పాల్గొన్నారు.

ఎన్‌సీసీ క్యాడెట్ల ర్యాలీ



నెల్లూరు(టౌన్): స్వామి వివేకానంద జయంతిని పురస్కరించుకొని బీవీనగర్‌లోని కేఎన్నార్ స్కూల్ నుంచి మాగుంట లేఅవుట్లోని అనిల్ గార్డెన్స్ వరకు ర్యాలీని ఎన్‌సీసీ క్యాడెట్లు గురువారం నిర్వహించారు. అక్కడి వివేకానంద విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం మదర్‌థెరిసా వృద్ధాశ్రమంలో పండ్లు పంపిణీ చేశారు. ప్రధానోపాధ్యాయుడు విజయ ప్రకాష్, ఎన్‌సీసీ అసోసియేట్ ఆఫీసర్ నరేంద్రబాబు, అధికారులు నాగరాజు, ధనలక్ష్మి, తదితరులు పాల్గొన్నారు.

మాస్టర్ అథ్లెట్లకు సత్కారం

నెల్లూరు(స్టోన్‌హౌస్‌పేట): గుంటూరులో ఇటీవల నిర్వహించిన ఆంధ్రప్రదేశ్ అథ్లెటిక్స్ మీట్‌లో పతకాలను సాధించిన అథ్లెట్లను గురువారం సత్కరించారు. శాంతినగర్‌లోని నిర్మల సాధలో నిర్వహించిన కార్యక్రమంలో అసోసియేషన్ అధ్యక్షుడు నరసింహారెడ్డి మాట్లాడారు. 37 స్వర్ణ, 24 రజత, 10 కాంస్య పతకాలను జిల్లా అథ్లెట్లు సాధించారని వివరించారు. మహిళా విభాగంలో 172 పాయింట్లను సాధించి ఉమెన్ చాంపియన్‌షిప్‌ను దక్కించుకున్నారని పేర్కొన్నారు.

ముందస్తు సంక్రాంతి సంబరాలు



ఎంపీడీఓ కార్యాలయ ప్రాంగణంలో భోగి మంటలు వేస్తున్న ఉద్యోగులు

పొదలకూరు: స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో గురువారం ముందస్తు సంక్రాంతి సంబరాలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఎన్‌ఆర్‌ఈజీఎస్, వైఎస్సార్ క్రాంతిపథం కార్యాలయ అధికారులు, సిబ్బంది కలిసి కార్యాలయ ప్రాంగణంలో ముందస్తుగా భోగి మంటలు వేశారు. ఈ సంబరాల్లో ఎంపీడీఓ టి.నగేష్‌కుమారి, ఏఓ సుబ్రహ్మణ్యం, ఏపీఎం రోజ్‌మేరీ, ఏపీఓ ముధుసూదన్ తదితరులు పాల్గొన్నారు.

విజిలెన్స్ అధికారుల తనిఖీ

కోవూరు: విజిలెన్స్ అధికారులు సుధాకర్‌రెడ్డి తదితరుల బృందం గురువారం స్థానిక సబ్ రిజిస్ట్రార్ కార్యాలయం వద్ద స్టాంప్ వెండర్లను తనిఖీ చేసింది. వారి రికార్డులను పరిశీలించారు. ప్రభుత్వం నిర్ణయించిన ధర కన్నా అధిక ధరలకు స్టాంపులను విక్రయిస్తున్నారని ఆరోపణలు రావడంతో ఈ తనిఖీలు చేసినట్లు విజిలెన్స్ అధికారులు తెలిపారు. ప్రభుత్వం నిర్ణయించిన ధరకే స్టాంపులు విక్రయించాలని సూచించారు.

రాష్ట్రంలో టీడీపీ భూస్థాపితం ఖాయం



టీడీపీ నుంచి వైఎస్సార్‌సీపీలో చేరిన వారితో మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి

వెంకటాచలం: జగనన్న పాలనకు ఉన్న జనాదరణ చూస్తుంటే 2024 ఎన్నికల్లోపే రాష్ట్రంలో టీడీపీ భూస్థాపితం కావడం ఖాయమని రాష్ట్ర వ్యవసాయశాఖ మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి అన్నారు. వెంకటాచలంలోని వైఎస్సార్‌సీపీ కార్యాలయంలో పంచాయతీ పరిధిలోని వడ్డిపాళేనికి చెందిన తురకా పెంచలయ్య, హరిబాబు, శీనయ్య, ఉప్పు అంకయ్య, ఎంపీటీసీ మాజీ సభ్యుడు ఉప్పు వెంకటేశ్వర్లు, యామాల సునీల్‌తోపాటు 100 కుటుంబాల వారు టీడీపీ నుంచి మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి సమక్షంలో వైఎస్సార్‌సీపీలో చేశారు. వైఎస్సార్‌సీపీ జిల్లా అధికార ప్రతినిధి మందల వెంకటశేషయ్య ఆధ్వర్యంలో పార్టీలో చేరిన వీరికి మంత్రి కాకాణి కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ జగనన్న పాలనకు ఆకర్షితులై స్వచ్ఛందంగా టీడీపీ నుంచి వైఎస్సార్‌సీపీలోకి వలసలు ప్రారంభమయ్యాయని తెలిపారు. సర్వేపల్లి నియోజకవర్గంలో అన్నివర్గాల ప్రజలకు సమ ప్రాధాన్యం ఇస్తూ గ్రామాలను అభివృద్ధి చేస్తున్నామన్నారు. గడిచిన రెండు ఎన్నికల్లో టీడీపీకి అండగా నిలిచిన వెంకటాచలం వడ్డిపాళేనికి చెందిన 100 కుటుంబాలు ప్రస్తుతం నియోజకవర్గంలో చేస్తున్న అభివృద్ధి కార్యక్రమాలను చూసి వైఎస్సార్‌సీపీలో చేరడం సంతోషకరమన్నారు. వైఎస్సార్‌సీపీ జిల్లా అధికార ప్రతినిధి మందల వెంకటశేషయ్య మాట్లాడుతూ సోమిరెడ్డి కార్యక్రమాలకు సర్వేపల్లి నియోజకవర్గంలో జనం లేక వెలవెలబోతుండడంతో సిగ్గుమాలిన రాజకీయాలు చేస్తున్నారని విమర్శించారు. వెంకటాచలంలో బుధవారం జరిగిన టీడీపీ కార్యక్రమానికి మండలంలో జనాలు రాకపోవడంతో నెల్లూరు నుంచి యువకులను తీసుకురావడం సిగ్గుచేటన్నారు. కార్యక్రమంలో మండల వైస్ ఎంపీపీ కనుపూరు కోదండరామిరెడ్డి, జెడ్పీటీసీ సభ్యుడు సుబ్రహ్మణ్యం, మందల పెంచలయ్య, నాటకం శ్రీనివాసులు, అడపాల ఏడుకొండలు, వెలిబోయిన వెంకటేశ్వర్లు, చీకుర్తి నరసయ్య తదితరులు పాల్గొన్నారు.

'ఫ్యామిలి డాక్టర్'తో.. పేదల చెంతకే వైద్యసేవలు

- మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి
- వైఎస్సార్ హెల్త్ క్లినిక్ నిర్మాణానికి శంకుస్థాపన



హెల్త్ క్లినిక్ భవన నిర్మాణానికి శంకుస్థాపన చేస్తున్న మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి

మనుబోలు: పేదల చెంతకే వైద్యసేవలు అందించాలనే లక్ష్యంతో సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి 'ఫ్యామిలీ డాక్టర్' కార్యక్రమానికి రూపకల్పన చేశారని రాష్ట్ర వ్యవసాయశాఖ మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి పేర్కొన్నారు. మండలంలోని అక్కంపేట గ్రామంలో రూ.17.50 లక్షలతో నిర్మించనున్న డాక్టర్ వైఎస్సార్ హెల్త్ క్లినిక్ భవనానికి గురువారం శంకుస్థాపన చేశారు. అనంతరం యువజన దినోత్సవాన్ని పురస్కరించుకుని మాజీ సర్పంచ్ నారపరెడ్డి కిరణ్‌కుమార్‌రెడ్డి ఏర్పాటు చేసిన ఎస్ఎస్ఆర్ ఫౌండేషన్ లోగోను మంత్రి ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ 'ఫ్యామిలీ డాక్టర్' విధానాన్ని పేదలకు కూడా అందించాలనే సంకల్పంతో రాష్ట్ర ప్రభుత్వం కుటుంబ డాక్టర్ విధానాన్ని ప్రారంభించినట్లు తెలిపారు. ఇందులో వైఎస్సార్ విలేజ్ క్లినిక్‌లు కీలకపాత్ర పోషిస్తాయన్నారు. రాష్ట్ర ప్రభుత్వం యువతకు ఉద్యోగాల కల్పన కోసం స్కిల్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్‌ను ఏర్పాటు చేసి వివిధ రకాల వృత్తి నైపుణ్య కోర్సుల్లో శిక్షణ ఇస్తోందని తెలిపారు. అక్కంపేట గ్రామంలో తన తండ్రి పేరుతో ఎస్ఎస్ఆర్ ఫౌండేషన్ స్థాపించి ఎన్నో సేవా కార్యక్రమాలు చేస్తున్న కిరణ్ నిరుద్యోగులకు అవసరమైన మెళకువలు నేర్పేందుకు నైపుణ్యాభివృద్ధి కోర్సులు ప్రారంభించడం అభినందనీయమన్నారు. కార్యక్రమంలో ఉపాధి కల్పన అధికారి సురేష్‌కుమార్, ఎంపీపీ వజ్రమ్మ, సర్పంచ్ నారపరెడ్డి జాంబవతమ్మ, ఎంపీడీఓ వెంకటేశ్వర్లు, వైఎస్సార్‌సీపీ నాయకులు పాల్గొన్నారు.

వివేకానందుని స్ఫూర్తితో ముందుకుసాగాలి

యువత స్వామి వివేకానందుని స్ఫూర్తితో ముందుకుసాగాలని రాష్ట్ర వ్యవసాయశాఖ మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి సూచించారు. మనుబోలులోని జెడ్పీ ఉన్నత పాఠశాల క్రీడా మైదానంలో గురువారం ఎస్ఆర్ క్రికెట్ టోర్నమెంట్‌ను మంత్రి కాకాణి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన కార్యక్రమంలో మంత్రి మాట్లాడుతూ భారతదేశ కీర్తిని అంతర్జాతీయస్థాయిలో ఇనుమడింపజేసిన వివేకానందుని జీవితాన్ని యువత ఆదర్శంగా తీసుకోవాలన్నారు. రాష్ట్ర ప్రభుత్వం క్రీడలకు పెద్దపీట వేస్తోందని, శారీరక, మానసిక ధృడత్వానికి క్రీడలు దోహదపడతాయని తెలిపారు. 'సేవానాథం' ట్రస్ట్‌ను నెలకొల్పి సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్న శ్రీనాథ్‌రెడ్డి అభినందనీయులన్నారు. అనంతరం యువతతో కలిసి మంత్రి కాకాణి సరదాగా క్రికెట్ ఆడారు. కార్యక్రమంలో సేవానాథం ట్రస్ట్ వ్యవస్థాపకుడు మాచిరెడ్డి శ్రీనాథ్‌రెడ్డి, కోడూరు కల్పలత, వంశీకృష్ణ, ఎంపీపీ వజ్రమ్మ, మునిగిరీష్, హరగోపాల్‌రెడ్డి, మల్లికార్జునరెడ్డి, ఆదినారాయణ, మీరారెడ్డి, వెంకటసుబ్బయ్య, సాయిమోహన్‌రెడ్డి, ఎంవీబీరెడ్డి, చంద్రశేఖర్‌రెడ్డి, భాస్కర్‌గౌడ్, శశిరెడ్డి, రవీందర్‌రెడ్డి, ట్రస్ట్ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

వివేకానందుడు యువతకు ఆదర్శం

- జిల్లా యువ కేంద్రం కన్వీనర్ మహేందర్‌రెడ్డి



వెంకటాచలం: వీఎస్‌యూలో వివేకానందుని చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న వీసీ తదితరులు

కొడవలూరు: భారతదేశ కీర్తిని అంతర్జాతీయ స్థాయిలో ఇనుమడింపజేసిన స్వామీ వివేకానందుడు యువతకు ఆదర్శప్రాయులని జిల్లా యువకేంద్రం కన్వీనర్ డాక్టర్ ఎ.మహేందర్‌రెడ్డి పేర్కొన్నారు. మండలంలోని నార్తురాజుపాళెంలో ఉన్న వెంకటేశ్వర ఇంజినీరింగ్ కళాశాలలో గురువారం నిర్వహించిన యువజనోత్సవంలో ఆయన స్వామీ వివేకానందుని చిత్రపటానికి పూలమాల వేసి ఘన నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి విద్యార్థి స్వామీ వివేకానందుడు రచించిన పుస్తకాలను చదవాలన్నారు. కార్యక్రమంలో పినాకిని వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షుడు కె.మురళీమోహన్‌రావు, కళాశాల చైర్మన్ పెనుబల్లి బాబునాయుడు, డైరెక్టర్లు పి.కృష్ణచైతన్య, జె.చంద్రమౌళి, ప్రిన్సిపల్ పి.కుమార్‌బాబు, ఎన్ఎస్ఎస్ అధికారి టి.సుబ్రహ్మణ్యం, అధ్యాపకులు పాల్గొన్నారు.

వీఎస్‌యూలో..

వెంకటాచలం: మండలంలోని కాకుటూరు వద్ద నున్న విక్రమ సింహపురి విశ్వవిద్యాలయంలో గురువారం స్వామీ వివేకానందుని జయంతిని పురస్కరించుకుని జాతీయ యువజన దినోత్సవ వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా వివేకానందుని చిత్రపటానికి వీసీ జీఎం సుందరవల్లి, రిజిస్ట్రార్ డాక్టర్ పి.రామచంద్రారెడ్డి, ఇతర అధ్యాపకులు పూలమాలలు వేసి ఘన నివాళులర్పించారు. స్వామీ వివేకానందుని జీవితం గురించి వీసీ జీఎం సుందరవల్లి విద్యార్థులకు వివరించారు.

గాంధీ ఆశ్రమంలో..

ఇందుకూరుపేట: మండలంలోని పల్లిపాడులో ఉన్న పినాకినీ సత్యాగ్రహ గాంధీ ఆశ్రమంలో గురువారం స్వామీ వివేకానంద జయంతి సందర్భంగా యువజనోత్సవాలను ఘనంగా నిర్వహించారు. వివేకానందుని చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆశ్రమ కో–కన్వీనర్ రవీంద్రరెడ్డి మాట్లాడుతూ స్వామీ వివేకానందుని ప్రతి ఒక్కరూ ఆదర్శంగా తీసుకుని ముందుకుసాగాలని సూచించారు. కార్యక్రమంలో సర్పంచ్ రెడ్డిపోగు సుధాకర్, ఉపాధ్యాయురాలు రేవతి పాల్గొన్నారు.

ఏబీవీపీ ఆధ్వర్యంలో..

బుచ్చిరెడ్డిపాళెం: నగర పంచాయతీ బుచ్చిరెడ్డిపాళెంలో ఏబీవీపీ ఆధ్వర్యంలో స్వామీ వివేకానందుని జయంతి వేడుకలను గురువారం ఘనంగా నిర్వహించారు. వివేకానందుని చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఏబీవీపీ కోవూరు నియోజకవర్గ కన్వీనర్ వినయ్ మాట్లాడుతూ స్వామీ వివేకానందుడు భారతదేశ ఖ్యాతిని ప్రపంచ వ్యాప్తంగా విస్తరింపచేశారని తెలిపారు. కార్యక్రమంలో ఏబీవీపీ నాయకులు సురేష్, గంగాధర్ తదితరులు పాల్గొన్నారు.

విడవలూరులో..

మండలంలోని రామచంద్రాపురం పంచాయతీ లక్ష్మీపురంలో స్వామీ వివేకానందుని జయంతి వేడుకలను గురువారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా స్థానికులు ర్యాలీ నిర్వహించడంతోపాటు యువతకు ఆటల పోటీలు నిర్వహించారు. కార్యక్రమంలో స్థానికులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.



కొడవలూరు: వివేకానందుని చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న జిల్లా యువ కేంద్రం కన్వీనర్ తదితరులు



ఇందుకూరుపేట: గాంధీ ఆశ్రమంలో..



బుచ్చిరెడ్డిపాళెం: లక్ష్మీపురంలో ర్యాలీ నిర్వహిస్తున్న యువత

గ్రీన్ అవెన్యూను పరిశీలించిన ట్రైనీ కలెక్టర్



ఉద్యాన పంటల వివరాలు తెలుసుకుంటున్న ట్రైనీ కలెక్టర్, డ్వామా అడిషనల్ పీడీ

పొదలకూరు: మహాత్మాగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకంలో భాగంగా మండలంలో రోడ్ల వెంబడి నాటిన మొక్కల(గ్రీన్ అవెన్యూ)ను ట్రైనీ కలెక్టర్ విద్యాధరి, డ్వామా అడిషనల్ పీడీ నిర్మలాదేవి గురువారం పరిశీలించారు. పొదలకూరు పంచాయతీ చిట్టేపల్లి గ్రామానికి వెళ్లే అవెన్యూను, పొదలకూరు లేఅవుట్‌లో నాటిన మొక్కలను పరిశీలించారు. మండలంలోని కనుపర్తిలో ఉద్యాన పంటల కింద ఎన్‌ఆర్‌ఈజీఎస్ పథకంలో అందించిన నిమ్మ మొక్కలను పరిశీలించి రాయితీ వివరాలను అడిగి తెలుసుకున్నారు. వారి వెంట ఎంపీడీఓ టి.నగేష్‌కుమారి, ఏఈఓ మధుసూదన్‌రావు, టీఏ వెంకటసాయి తదితరులు ఉన్నారు.

ఈ–క్రాప్ నమోదుకు రైతులు సహకరించాలి



రైతులకు సూచనలిస్తున్న జిల్లా వ్యవసాయాధికారి సుధాకర్‌రాజు

తోటపల్లిగూడూరు: ఈ–క్రాప్ నమోదుకు రైతులు సహకరించాలని జిల్లా వ్యవసాయాధికారి సుధాకర్‌రాజు సూచించారు. ఈ–క్రాప్ నమోదుపై మండలంలోని వరిగొండ గ్రామ సచివాలయంలో గురువారం రైతులకు అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతుల కోసం ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను వారు పొందాలంటే ఈ–క్రాప్ నమోదు తప్పనిసరి అని తెలిపారు. అలాగే వరిసాగులో సాధారణ యూరియాకు బదులుగా నానో యూరియాను వినియోగించాలన్నారు. డ్రోన్ పరికరంతో పురుగుమందులను పిచికారీ చేసి పెట్టుబడులు తగ్గించుకోవాలని తెలిపారు. అనంతరం స్థానికంగా ఉన్న పంట పొలాలను పరిశీలించి రైతులకు పలు సూచనలిచ్చారు. కార్యక్రమంలో ఇందుకూరుపేట ఏడీఏ రాజ్‌కుమార్, ఇఫ్కో జిల్లా అధికారి నారాయణ, ఏఈఓ ప్రసన్న, వీఏఏ సుమంత్, పలువురు ఆదర్శ రైతులు పాల్గొన్నారు.

ఆశ్రమంలో హోమ్ స్క్రీన్ థియేటర్



ఆశ్రమంలో నూతనంగా ఏర్పాటు చేసిన హోమ్ స్క్రీన్‌లో వీక్షిస్తున్న చిన్నారులు

కొడవలూరు: మండలంలోని టపాతోపు విశ్వజనని అనాథాశ్రమంలో నిర్వాహకులు హోమ్ స్క్రీన్ థియేటర్ ఏర్పాటు చేశారు. దీనిని ఆశ్రమంలోని తనూష అనే చిన్నారితో గురువారం ప్రారంభింపజేశారు. ఈ సందర్భంగా ఆశ్రమ నిర్వాహకులు బుర్లా శ్రీలక్ష్మి, ప్రేమ్‌సాగర్ మాట్లాడుతూ ఆశ్రమంలో ప్లే క్లాస్ మొదలుకొని పీజీ వరకు చదివే బాల, బాలికలు ఉన్నారని, సెలవుల్లో వినోదంతోపాటు విజ్ఞానం పెంపొందించుకొనేలా హోమ్ స్క్రీన్ ఏర్పాటు చేసినట్లు తెలిపారు.

నేటి నుంచి ఉజ్జీవ మహాసభలు

బుచ్చిరెడ్డిపాళెం: స్థానిక సియోన్ తెలుగు బాప్టిస్ట్ చర్చి ఆధ్వర్యంలో శుక్ర, శనివారాల్లో రక్షణ సువార్త ఉజ్జీవ మహాసభలు నిర్వహిస్తున్నట్లు చర్చి సెక్రటరీ శ్యామ్‌ప్రసాద్ గురువారం తెలిపారు. ఈ సభలు బుచ్చిరెడ్డిపాళెంలోని ఎంఎం ఫంక్షన్ హాల్‌లో నిర్వహిస్తున్నట్లు తెలిపారు. క్రైస్తవులు పాల్గొనాలని కోరారు.

చాముండేశ్వరి అమ్మవారికి వెండిపాశం వితరణ



ఇందుకూరుపేట: మండలంలోని గంగపట్నంలో వెలసిన చాముండేశ్వరి అమ్మవారికి దాతలు గురువారం వెండిపాశాన్ని వితరణగా అందజేశారు. ఈ సందర్భంగా ఆలయ అర్చకుడు మాట్లాడుతూ మండలంలోని రాముడుపాళెం గ్రామానికి చెందిన తొటపల్లి శేషమ్మ కుమారుడు వంశీధర్ – లహరి దంపతులు అమ్మవారికి సుమారు రూ.30 వేల విలువ చేసే వెండిపాశాన్ని అందజేశారని తెలిపారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నాయకుడు ఫణీంద్రనాయుడు పాల్గొన్నారు.

ప్రజల ప్రేమానురాగాలను మరువలేం



పేదలకు దుస్తులు పంపిణీ చేస్తున్న పూజితారెడ్డి

పొదలకూరు: తోడేరు గ్రామ ప్రజల ప్రేమానురాగాలను ఎన్నటికీ మరువలేమని రాష్ట్ర వ్యవసాయశాఖ మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి కుమార్తె పూజితారెడ్డి అన్నారు. సంక్రాంతి పండగను పురస్కరించుకుని గురువారం మండలంలోని తోడేరు పంచాయతీ తోడేరు, రత్నగిరి, తోడేరు ఎస్సీకాలనీ, శాంతినగర్, వీవర్స్‌కాలనీల్లో పూజితారెడ్డి పేదలకు దుస్తులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ తాము ఏ స్థాయిలో ఉన్నా స్వగ్రామం తోడేరును మరచిపోయేది లేదని, ఇక్కడి నుంచే తమ రాజకీయ ప్రస్థానం ప్రారంభమైందని తెలిపారు. సంక్రాంతి పండగను ప్రజలు ఆనందంగా జరుపుకోవాలన్నారు. కార్యక్రమంలో ఎంపీటీసీ మాజీ సభ్యుడు ఏనుగు శశిధర్‌రెడ్డి, అట్ల రవీంద్ర, ఎంపీటీసీ సభ్యురాలు స్వర్ణ సుగణ పాల్గొన్నారు.

తాటాకులకు డిమాండ్



ఎడ్ల బండ్లపై తాటాకులను తరలిస్తున్న దృశ్యం

బుచ్చిరెడ్డిపాళెం(విడవలూరు): సంక్రాంతి పండగ సమీపించడంతో తాటాకులకు మంచి డిమాండ్ ఏర్పడింది. సంక్రాంతి పండగలో భాగంగా తొలి పండగైన భోగి సందర్భంగా తాటాకుల అవసరం ఎక్కువగా ఉంటుంది. దీనిని ఆసరాగా చేసుకున్న కొందరు వ్యక్తులు ఇప్పటి నుంచే తాటి చెట్లకు ఉన్న ఆకులను నరికి వాటిని ఎండబెట్టే ప్రయత్నంలో బిజీగా ఉన్నారు. మండలంలోని అన్ని గ్రామాల్లో తాటాకులను నరికి వాటిన ఎండబెట్టిన తరువాత జిల్లా కేంద్రమైన నెల్లూరుకు తరలించి వాటిని విక్రయించడం ప్రతి సంవత్సరం జరుగుతున్న తంతు. ఈ సంవత్సరం కూడా తాటాకులను విక్రయించి వాటి ద్వారా లాభార్జన పొందేందుకు కొందరు వ్యక్తులు రైతుల పొలాల్లోని తాటిచెట్ల ఆకులను నరికి వాటిని ఎండబెట్టి ఎడ్ల బండ్లలో నెల్లూరుకు తరలిస్తున్నారు. 100 తాటాకులు ఉన్న మోపును రూ.250 నుంచి రూ.350 వరకు విక్రయిస్తున్నట్లు తెలుస్తోంది.

గృహ నిర్మాణాలు పూర్తి చేయాలి

కొడవలూరు: ఉగాది కల్లా జగనన్న కాలనీల్లో నిర్మాణంలో ఉన్న గృహాలను పూర్తి చేయాలని ఎంపీడీఓ పి.సుబ్రహ్మణ్యం ఆదేశించారు. గురువారం కొడవలూరు దర్గా సంఘం వద్దనున్న జగనన్న కాలనీని హౌసింగ్ అధికారులతో కలిసి ఎంపీడీఓ పరిశీలించారు. మండలంలో ఉగాది కల్లా 279 గృహాలు పూర్తి చేసి గృహ ప్రవేశాలు చేయించాలని లక్ష్యంగా పెట్టుకున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో హౌసింగ్ ఏఈ పి.సురేష్‌కుమార్, పంచాయతీ కార్యదర్శి జి.రాధాకృష్ణ, ఇంజినీరింగ్ అసిస్టెంట్ శ్రీకాంత్, వర్క్ ఇన్‌స్పెక్టర్ జానీ పాల్గొన్నారు.

చెరువుకు బహిరంగ వేలంపాట

ఇందుమూలముగా తెలియజేయడమేమనగా శ్రీ పొట్టి శ్రీరాములు నెల్లూరు జిల్లా, వెంకటాచలం మండలంలోని కురిచెర్లపాడు గ్రామ పంచాయితీకి సంబంధించిన కురిచెర్లపాడు కొత్త,పాత చెరువుకు సంబంధించి ఫసలీ నెం. 1432 చేపలుపట్టుకునే హక్కుకై వేలంపాట జరుగును. తే 18-01-2023 ది మధ్యాహ్నం గం॥ 12.0 గం॥లకు కురిచెర్లపాడు గ్రామ సచివాలయం నందు నిర్వహించబడునని తెలియజేయడమైనది. సదరు వేలంపాటకు మండల విస్తరణ అధికారి పాల్గొని అధ్యక్షత వహించబడును. కావున ఈ వేలంపాటలో పాల్గొనే వారు ఎవ్వరైనా పంచాయితీ వారు నిర్ణయించిన రుసుమును చెల్లించి వేలంపాటలో పాల్గొనవచ్చును.

ఇట్లు: పి.వీరాస్వామి, సెక్రటరీ, కురిచెర్లపాడు గ్రామ పంచాయితీ, వెంకటాచలం మండలం, సెల్: 9550679500.